సాక్షి
ఆదిలాబాద్
బుధవారం । 27 । మార్చి । 2024



పేదోడి ఫ్రిజ్‌కు తగ్గుతున్న ఆదరణ

వేసవి వచ్చిందంటే చాలు చల్లని నీటినిచ్చే రంజన్లు గుర్తుకొస్తాయి. పేదోడి ఫ్రిజ్‌గా పిలిచే వీటికి రోజురోజుకు ఆదరణ కరువవుతోందని కుమ్మరులు పేర్కొంటున్నారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ: 6:30	గురు: 4:52

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.0 /29.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్ నాగరాజు

ఆదిలాబాద్‌టౌన్: ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో రిమ్స్‌లోని డైస్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన క్లబ్ ఫుట్ (వక్రపాద) ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఉమ్మడి జిల్లాలోని 18 ఏళ్లలోపు గల పిల్లలు 49 మంది హాజరయ్యారు. ఆర్థోపెడిక్ సర్జన్ నాగరాజు చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. వీరికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. ఇందులో ఆరుగురిని తిరుపతిలోని బర్డ్ ఆసుపత్రికి, మరో 43 మందిని రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ వైసీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 2019లో పది మంది పిల్లలకు, 2021లో 9మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించినట్లుగా పేర్కొన్నారు. కార్యక్రమంలోఎంహెచ్‌టీ వైద్యులు వీణా సాగర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి



వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

తలమడుగు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్‌లో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను మంగళవారం తనిఖీ చేశారు. జిల్లాలోకి అక్రమంగా మద్యం, డబ్బు, గంజాయి, మాదకద్రవ్యాలు వంటివి రవాణా కాకుండా గట్టి నిఘ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయా శాఖల సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. అనంతరం తలమడుగు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఇందులో రూరల్ సీఐ ఫణిందర్, ఎస్సై ధనశ్రీ, ఏఎస్సై సురేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరాకు చర్యలు



బోరుబావి నీటి తీరును పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి గంగాధర్

సాక్షి ఎఫెక్ట్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అసోదా గ్రామ పంచాయతీ పరిధి పూనగూడలో తాగునీటి ఇక్కట్లపై 'ఏజెన్సీ ప్ర'జల'పాట్లు.. గిరి గోస' శీర్షికన 'సాక్షి' దినపత్రిక మెయిన్, జిల్లా పేజీల్లో సోమవారం ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. ఖండాల గ్రామంతో పాటు పూనగూడలో నీటి ఎద్దడి సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూనగూడలో మోటబావి, వాగు సమీపంలోని బావిని పంచాయతీ కార్యదర్శి గంగాధర్ మంగళవారం పరిశీలించారు. సమస్య శాశ్వత పరిష్కారానికి సంబంధించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డిని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా మరో నాలుగైదు రోజుల్లోగా ఆయా గ్రామాల్లో తాగునీటి శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

నేడు ఉద్యోగుల భవిష్యనిధిపై అవగాహన

కైలాస్‌నగర్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో 'భవిష్య నిధి మీ వద్దకు' అనే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కరీంనగర్ ప్రాంతీయ కార్యాలయ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్‌లో మున్సిపల్ కౌన్సిల్ కాన్ఫరెన్స్ హాల్, నిర్మల్‌లో టీఎన్జీవోస్ భవన్, మంచిర్యాలలో మున్సిపల్ కౌన్సిల్ హాల్, ఆసిఫాబాద్‌లో కాగజ్‌నగర్ మున్సిపల్ హాల్‌లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.45గంటల వరకు ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. ఆయా జిల్లాల్లోని కార్మిక సంఘాలు, యజమానుల సంఘాలు వారి ఫిర్యాదులతో పాటు సలహాలు, సూచనలు అందించవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పీఎఫ్ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

సీన్ మారింది!



- అసెంబ్లీ ఎన్నికల తర్వాత మారిన రాజకీయాలు
- బీఆర్‌ఎస్ నుంచి పలువురు ముఖ్య నేతలు జంప్
- బీజేపీలో కరువైన సమన్వయం
- చేరికలపై ఫోకస్ పెంచిన కాంగ్రెస్
- పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు మనోగతం ఎటువైపో?



సాక్షి, ఆదిలాబాద్: అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో ఆయా పార్టీల్లో సీన్ మారిపోయింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో ఓటరు మనోగతం ఎటువైపు ఉంటుందో అనేది ఆసక్తికరంగా మారింది. శాసనసభ ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో అత్యధిక ఓట్లు బీఆర్‌ఎస్ సాధించగా, ఆ తర్వాత బీజేపీ, మూడో స్థానంలో కాంగ్రెస్ నిలిచింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. ఈ ఎన్నికల్లో ఫలితం ఎలా ఉంటుందనేది చూడాల్సిందే. నియోజకవర్గాల్లో మారిన పరిస్థితుల నేపథ్యంలో ఓటరు తీరు కూడా మారుతుందా.. లేనిపక్షంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు పోలిక లేదన్నట్లుగా వైవిధ్యంగా తీర్పునిస్తారో చూడాల్సిందే.

బీఆర్‌ఎస్ నుంచి వలసలు..

అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ నుంచి ఆదిలాబాద్‌లో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కాంగ్రెస్‌లోకి, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ బీజేపీలోకి చేరిపోయారు. కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు కూడా పైరెండు పార్టీల్లోకి జంప్ చేశారు. బోథ్ నియోజకవర్గంలో తాంసి జెడ్పీటీసీ రాజు, ఇతర ద్వితీయ శ్రేణి నేతలు ఇటీవలే బీజేపీలో చేరారు. నిర్మల్‌లో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం సాగుతుంది. మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్ కాంగ్రెస్‌లో చేరారు. ముథోల్‌లో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. సిర్పూర్‌లో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హస్తం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ రెండో స్థానంలో నిలిచింది. తద్వారా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దీని ప్రభావం ఎలా ఉంటుందో చూడాల్సిందే. బీఆర్‌ఎస్ అభ్యర్థి సక్కు ముఖ్యంగా ఆయా నియోజకవర్గాల్లో ముఖ్య నేతలు పార్టీ మారడంతో అక్కడ ఓటర్లను ఆకట్టుకునేందుకు శ్రమించాల్సిన పరిస్థితి కనిపిస్తుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో సాధించిన ఓట్లు..

పార్టీ	ఓట్లు
బీఆర్‌ఎస్	4,65,476
బీజేపీ	4,48,961
కాంగ్రెస్	2,52,286

బీజేపీలో సఖ్యత కుదిరేనా..

బీజేపీ అభ్యర్థిగా గొడం నగేశ్‌కు ఆయా నియోజకవర్గాల్లో ముఖ్య నేతలతో సఖ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బోథ్ నియోజకవర్గంలోని తలమడుగు మండలం ఉండం గ్రామంలో కేంద్ర మంత్రి అర్జున్ ముండా ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్లమెంటరీ సమావేశంలో నిర్మల్, ముథోల్, సిర్పూర్ ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబులు పాల్గొనకపోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అలాగే మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు కూడా పాల్గొనలేదు. ఎంపీ సోయం బాపూరావు తనకు టికెట్ ఇవ్వలేదన్న అసంతృప్తిలో పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సిట్టింగ్ స్థానాన్ని బీజేపీ నిలుపుకునేందుకు ప్రధానంగా ముఖ్య నేతల మధ్య సమన్వయం అవసరమన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇటీవల హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సఖ్యత కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలుస్తుంది. ఎన్నికల నోటిఫికేషన్ ముందే ఈ పార్టీలో పరిస్థితులు చక్కదిద్దుకుంటాయా అనేది వేచి చూడాల్సిందే.

కాంగ్రెస్ బలగం పెరుగుతోంది..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంట్ ఎన్నికలు జరుగుతుండగా, ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన ఆదిలాబాద్‌పై ఆ పార్టీ ఫుల్ ఫోకస్ పెట్టింది. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గంలో సమావేశాలు పూర్తి చేశారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలగం పెరుగుతుండటంతో ఎన్నికల్లో విజయం సాధిస్తామన్న ధీమా వ్యక్తమవుతుంది. అయితే ఇప్పటికీ అభ్యర్థి ప్రకటనలో పార్టీ పరంగా తర్జనభర్జన నెలకొంది. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు అభ్యర్థులను ప్రకటించి ప్రచారానికి దిగుతుండగా, కాంగ్రెస్ మాత్రం ఇప్పటికీ అభ్యర్థిని ప్రకటించకపోవడం కొంత మైనస్‌గా మారుతుంది.

తొలివిడత ర్యాండమైజేషన్ పూర్తి

- 768 పోలింగ్ కేంద్రాలు.. 4,385 మంది సిబ్బంది
- కలెక్టర్ రాజర్షి షా



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సిబ్బంది తొలివిడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 768 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే 4,385 మంది అధికారులను తొలివిడత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అసిస్టెంట్లు ఉంటారని పేర్కొన్నారు. ఈసీ నిబంధనలకు లోబడి పారదర్శకంగా పోలింగ్ సిబ్బంది కేటాయింపు ప్రక్రియ నిర్వహించినట్లుగా ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, కలెక్టరేట్ ఏవో అరవింద్‌కుమార్, ఈడీఎం రవీందర్, ఎన్‌ఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి ఎంపిక చేసిన కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్‌తో పోలింగ్ నిర్వహణపై శిక్షణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఎన్నికల నిర్వహణపై రెవెన్యూ అధికారులతో మంగళవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ విధుల కోసం నియమించిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించారు. శిక్షణలో భాగంగా ఫారం-12 కౌంటర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గ సిబ్బందికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, బోథ్ నియోజకవర్గంలోని వారికి ఇచ్చోడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లుగా తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు హాజరైన ఉద్యోగులకు ఫారం-12 పత్రాలను అందజేయాలని ఆదేశించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవీ, ఆర్డీవో వినోద్ కుమార్, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

కైలాస్‌నగర్: జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సీఎంఆర్ లక్ష్యాలపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. యాసంగి పంట కొనుగోలుకు ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా,టెంట్లు వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీచర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో, అదనపుకలెక్టర్ శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

200 రోజులు 'ఉపాధి' కల్పించాలి

ఎదులాపురం: ఉపాధి హామీ చట్టం కింద 200 రోజులు పని కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల కిసాన్ మజ్దూర్ సంఘం జిల్లా కార్యదర్శి కొడప సురేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా భవనంలో మంగళవారం సంఘం జిల్లా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టం కింద 200 రోజులు పని కల్పించాలని, కూలీలకు రోజు కూలి రూ.600 అందించాలన్నారు. అలాగే వేసవిలో మెడికల్ కిట్, టెంటు, తాగునీరు, పనిముట్లు వంటివి సరఫరా చేయాలన్నారు. ఇందులో సంఘం నాయకులు జుగదిరావ్, బుచ్చిరాం, సురేశ్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వివాహాలు | అభినందనీయం



నూతన వధూవరులతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి

- దస్నాపూర్‌గూడలో ఒక్కటైన ఎనిమిది జంటలు
- హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



వధూవరులకు కానుక అందజేస్తున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: ఆదివాసీ అండ్ సేవా సంఘం ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు నిర్వహించడం అభినందనీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. పూలాజీబాబా ప్రేరణతో సంఘం ఆధ్వర్యంలో దస్నాపూర్ జీపీ పరిధి దస్నాపూర్‌గూడలో మంగళవారం నిర్వహించిన సామూహిక వివాహ వేడుకలకు ఆయన అతిథిగా హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి నిర్వాహకులను అభినందించారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ఇలాంటి వివాహాలు ఎంతో మేలు చేస్తాయన్నారు. గ్రామ పటేల్ యశ్వంత్ రావు, కోటులే పుండలిక్ మాట్లాడుతూ.. గ్రామంలో 1983 నుంచి సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఏడాదిలో ఎన్ని సంబంధాలు కుదిరినా వాటన్నింటికీ ఒక తేదీ నిర్ణయించి ఒకేసారి వివాహాలు జరిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, ఎంపీపీ శోభాబాయి, జెడ్పీటీసీ పుష్పలత, ఆదివాసీ అండ్ సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖడే విష్ణు, ప్రధాన కార్యదర్శి మారుతి తదితరులున్నారు.

అర్హులందరినీ ఓటర్లుగా చేర్చేలా..

- స్వీప్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం
- విద్యాసంస్థల్లో ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు
- ఏప్రిల్ 14 వరకు ఓటరు నమోదుకు అవకాశం



ఓటు వినియోగంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ రాజర్షి షా (ఫైల్)

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా ముందుకు సాగుతుంది. ఇందు కోసం సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్(స్వీప్) ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఏప్రిల్ 14 వరకు ఓటరుగా నమోదుకు అవకాశం ఉండటంతో 18 ఏళ్లు నిండిన యువత తమ పేర్లు నమోదు చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పిస్తోంది. ఓటు ప్రాధాన్యత తెలియజేయడంతో పాటు ఓటరుగా నమోదు చేసుకునేలా యువతను చైతన్యపరుస్తున్నారు.

ముమ్మర ప్రచారం

కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై ముమ్మర ప్రచారం చేపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ఐటీఐ, పాలిటెక్నిక్, గిరిజన సంక్షేమ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఓటు ప్రాధాన్యత తెలియజేసేలా ఆదిలాబాద్‌లో 5కే రన్ చేపట్టారు. అలాగే ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహించి విద్యార్థులకు ఓటు అవశ్యకతను వివరించారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో యువతకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన మహిళలతో ఓటు హక్కుపై కలెక్టర్ ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించారు. అలాగే బస్టాండ్, రైల్వేస్టేషన్ వంటి ప్రదేశాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తమ ఆటపాటల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

పోలింగ్ శాతం పెంచే దిశగానూ

ఓటు నమోదు ప్రచార, అవగాహన కార్యక్రమాలతో పాటు త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచే దిశగానూ చర్యలు చేపట్టింది. తమ తల్లిదండ్రులు, కుటుంబీకులు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలంటూ పాఠశాల విద్యార్థులకు స్వీప్ ఆధ్వర్యంలో సంకల్ప పత్రాలు అందజేశారు. 16వేల మంది విద్యార్థులకు వాటిని అందజేసి తమ తల్లిదండ్రులు, కుటుంబీకులతో ఓటు హక్కు వినియోగించుకుంటామనేలా సంతకాలు తీసుకున్నారు.

యువత ఓటర్లుగా నమోదు కావాలి


ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్ల నిండిన యువత ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలి. వచ్చే నెల 14వరకు ఇందుకు అవకాశముంది. ఫారం-6 ద్వారా సంబంధిత బీఎల్‌ఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించి ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ఆన్‌లైన్‌లో ఓటర్స్ హెల్ప్ లైన్, ఎన్‌వీఎస్‌పీ పోర్టల్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఫారం-6తో పాటు ఆధార్ కార్డు, వయస్సును నిర్ధారించేలా ఎస్సెస్సీ మెమోను జత చేయాల్సి ఉంటుంది. గడువులోగా దరఖాస్తు చేసుకున్న వారు మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఓటర్ల నమోదుతో పాటు పోలింగ్‌శాతం పెంచేలా జిల్లాలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా మారాలి.

– రాజర్షి షా, జిల్లా ఎన్నికల అధికారి

ట్యాంకులున్నా.. చుక్క నీరు రాకపాయే!







వేసవి వచ్చిందంటే చాలు గిరి గ్రామాల్లో నీటి కటకట తప్పడం లేదు. ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామనే పాలకుల మాటలు ఆచరణలో కనిపించడం లేదు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లోని వాటర్ ట్యాంకులు చుక్క నీరు లేక అలంకారప్రాయంగా మారడమే ఇందుకు నిదర్శనం. పాలకుల పట్టింపులేనితనంతో ఆయా గ్రామాల్లో నీటి సరఫరా లేక ప్రజలు గొంతు తడుపుకునేందుకు నిత్యం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. -సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

జెడ్పీ వాహనాలకు డీజిల్ కష్టాలు

- పేరుకుపోయిన రూ.8లక్షల బకాయిలు
- డీజిల్ పోసేందుకు బంక్ యజమాని నిరాకరణ



జెడ్పీ కార్యాలయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా పరిషత్ అధికారుల వాహనాలకు డీజిల్ కష్టాలు ఎదురయ్యాయి. బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోవడం, ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కాకపోవడంతో బంక్ యజమాని డీజిల్ పోసేందుకు నిరాకరిస్తున్నాడు. దీంతో జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్ సహా సీఈవో, డిప్యూటీ సీఈవో వాహనాలు నడిచేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చైర్మన్, ఇద్దరు అధికారుల వాహనాలకు కొన్నేళ్లుగా కూపన్లపై పట్టణంలో గల ఓ పెట్రోల్ బంక్‌లో డీజిల్ పోయించుకునేవారు. చైర్మన్ వాహనానికి నెలకు నాలుగుసార్లు, సీఈవో, డిప్యూటీ సీఈవో వాహనాలకు నెలకు రెండు, మూడేసి సార్లు డీజిల్ ట్యాంక్ ఫుల్ చేయించేవారు. ఇందుకు సంబంధించి రెండేళ్లుగా పేరుకుపోయిన బకాయిలు రూ.8లక్షల వరకు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారి వాహనాలకు డీజిల్ పోసేందుకు బంక్ యజమాని నిరాకరించాడు. ఫలితంగా సీఈవో, డిప్యూటీ సీఈవోలు ఆ వాహనాలను పక్కనపెట్టి సొంత వాహనాల్లో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక చైర్మన్ అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడికైనా వెళ్లాలంటే తన జేబులో నుంచి డీజిల్ పోయించుకోవాల్సి వస్తోంది. ఈ విషయంపై జెడ్పీ అధికారులను సంప్రదించగా కొన్నేళ్లుగా జనరల్ ఫండ్ రావడం లేదని, ఫలితంగా బిల్లులు పేరుకుపోయాయన్నారు. బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి నివేదించినా మంజూరు కావడం లేదన్నారు.

క్లుప్తంగా

దాడిచేసిన వ్యక్తికి జైలు

నిర్మల్‌టౌన్‌: గొడ్డలితో దాడిచేసిన వ్యక్తికి నిర్మల్‌ న్యాయస్థానం తొమ్మిది నెలల సాధారణ జైలు శిక్ష, రూ.5,500 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్‌ వివరాల ప్రకారం... మామడ మండలం పరిమండల్‌ గ్రామానికి చెందిన జక్కుల మల్లయ్య అదే గ్రామానికి చెందిన జక్కుల వినీత్‌ గొర్లకు మంత్రం వేసి చంపుతున్నాడని వారం రోజులు నుంచి బెదిరిస్తున్నాడు. 16 సెప్టెంబర్‌ 2016వ తేదీన రాత్రి సమయంలో మల్లయ్య మొక్కజొన్న తోట కాపలికి వెళ్తుండగా.. వినీత్‌ మోటార్‌ సైకిల్‌పై వెనుక నుంచి వచ్చి గొడ్డలితో దాడిచేసి గాయపరిచాడు. దీంతో మల్లయ్య కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. ఈ విషయంపై మల్లయ్య మామడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై మల్లేష్‌ కేసు నమోదు చేసి చార్జిషీట్‌ దాఖలు చేసి కోర్టులో హాజరు పరిచాడు. ఏపీపీవో రమణకృష్ణ ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశాడు. ఈ మేరకు నిర్మల్‌ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి అజయ్‌ కుమార్‌ మంగళవారం పై విధంగా తీర్పును వెల్లడించాడు.

ఆవుకు సీమంతం



ఆవుకు సీమంతం చేస్తున్న రైతు నర్సయ్య

కుంటాల: ఇంటి ఆడపిల్లల మాదిరిగానే ఆవుకు సీమంతం జరిపించారు నిర్మల్‌ జిల్లా కుంటాల మండలం పెంచికల్‌పాడ్‌ గ్రామానికి చెందిన రైతు నర్సయ్య–మంజుల దంపతులు. చిన్నప్పటి నుంచి ఆవును ఎంతో ఆప్యాయంగా పెంచుకుంటున్నారు. ఇరుగు పొరుగు వారిని ఆహ్వానించి మంగళవారం వైభవంగా ఆవుకు సీమంతం జరిపించారు. పూలు, పండ్లు, చీరె, సారె, పసుపు, కుంకుమతో సంప్రదాయబద్ధంగా సీమంతం చేశారు. ఆవును పూజించడం ద్వారా ముక్కోటి దేవతలను పూజించినట్లుగా భావిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

పెళ్లి పేరిట మోసం చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్‌: పెళ్లి చేసుకుంటానని యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్‌ ఎస్సై రమణారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌ పట్టణంలోని గజానంద్‌ ఆస్పత్రిలో పనిచేస్తున్న బలిరావ్‌ సందీప్‌ జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువతితో రెండేళ్లుగా ప్రేమ వ్యవహారం కొనసాగిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. వారం రోజుల క్రితం ఆ యువతి ఫోన్‌ నంబర్‌ బ్లాక్‌ చేశాడు. రెండు రోజుల క్రితం ఆయన ఆస్పత్రికి రాగా ఆమె నిలదీసింది. దీంతో తనకు వేరే అమ్మాయితో పెళ్లి కుదిరిందని చెప్పడంతో వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. తనపై దాడికి దిగినట్లు ఆ యువతి టూటౌన్‌ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

వైన్స్‌ పర్మిట్‌ రూంలో ఒకరు మృతి

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన పోతరాజు ప్రశాంత్‌(35) అతిగా మద్యం తాగి మంగళవారం వైన్స్‌ పర్మిట్‌ రూంలో మృతిచెందాడు. ఎస్సై రాజు వివరాల ప్రకారం.. ప్రశాంత్‌ ప్రతి రోజు మద్యం తాగి తిరిగేవాడు. మంగళవారం ఉదయం ఏడు గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. సాయంత్రం సమయంలో కొత్త బస్టాండు పక్కన ఉన్న లక్కీ వైన్స్‌కు వెళ్లి పర్మిట్‌ రూంలో అతిగా మద్యం తాగి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేదోడి ఫ్రిజ్‌కు తగ్గుతున్న ఆదరణ

- కుండలు, రంజన్ల తయారీకి పెరుగుతున్న వ్యయం
- భారంగా మారుతున్న కుటుంబ పోషణ
- కార్పొరేషన్‌ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరుతున్న కుమ్మరులు



రంజన్లను తయారు చేస్తున్న మహిళ



రంజన్లు తయారీకి మట్టిని సిద్ధం చేస్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌రూరల్‌: గత కొన్నిరోజుల నుంచి ఎండలు దంచి కొడుతున్నాయి. ఈ సమయంలో ఎంత చల్లని నీళ్లు తాగితే అంతా మనస్సుకు హాయిగా అనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కొంత మంది రంజన్ల నీళ్లు తాగేందుకు ఎంతో మొగ్గు చూపుతారు. దీంతో మార్కెట్లో కుండలు, రంజన్ల విక్రయాలు కొంత మేర పెరుగుతున్నాయి. దీంతో వేసవి కాలం వచ్చిందంటే చాలు కుమ్మరులు తయారు చేసే మట్టి కుండలు గుర్తుకొస్తాయి. అలాంటిది పేదోడి ఫ్రిజ్‌గా పిలిచే రంజన్లకు రోజురోజుకు ఆదరణ కరువవుతోందని కుండలు తయారు చేసే కుమ్మరులు పేర్కొంటున్నారు.

నీళ్లు తాగేందుకు మొగ్గు...

మట్టితో తయారు చేసే రంజన్లలోని నీళ్లు తాగేందుకు పేదలతో పాటు వైద్య పరిజ్ఞానం ఉన్న ప్రతి ఒక్కరూ వేసవిలో మట్టికుండల్లోని, రంజన్లలోని నీటిని తాగేందుకే ఆసక్తి కనబరుస్తారు. మట్టితో తయారు చేసిన కుండలలోని, రంజన్లలోని నీళ్లను తాగితే ఆరోగ్యపరంగా మంచి ఫలితాలు ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. అయితే ప్రభుత్వాలు చేతువృత్తుల వారిని ఆదుకోవడంలో విఫలం చెందుతున్నాయని కుమ్మరి కులస్తులు వాపోతున్నారు.

వేసవిలో కుమ్మరులు బిజీబిజీ..

వేసవి కాలం వచ్చిందంటే చాలు కుమ్మరులు కుండలు, రంజన్లు తయారీలో బిజీబిజీగా గడుపుతారు. కుండలు, రంజన్లను తయారు చేయడానికి చెరువు మట్టి, గుర్రం పేడ, చెక్కపొల్లు (కట్టెలు) వంటి వాటిని వీటి తయారీకి ఉపయోగిస్తారు. ఒక కుండ తయారు చేయడానికి సుమారు రూ.100 నుంచి రూ.120, రంజన్‌ తయారుకు రూ.150 నుంచి రూ.170 వరకు ఖర్చవుతుంది. ఇదిలా ఉండగా కొన్ని సందర్భాల్లో వాతావరణం అనుకూలించకపోతే తాము పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి వస్తుందని వారు పేర్కొంటున్నారు.

ఇతర ప్రాంతాల్లో గుర్తింపు..

జిల్లాలో ఆదిలాబాద్‌రూరల్‌ మండలం బంగారుగూడ, ఆదిలాబాద్‌ పట్టణంలోని కొత్త, పాత కుమ్మరివాడ, ఉట్నూర్‌ సమీపంలోని కుమ్మరికుంట, సిరికొండ, బేల, తదితర ప్రాంతాల్లో వేసవి కాలంలో కుమ్మరులు రంజన్లు, కుండలు తయారు చేస్తారు. ఇక్కడ తయారు చేస్తున్న రంజన్లు, కుండలు ప్రముఖ నగరాలకు కూడా తీసుకెళ్తారు. ఆదిలాబాద్‌ రంజన్లకు, కుండలకు ఇతర రాష్ట్రాల్లోనూ గిరాకీ గతంలో ఉండేది.

ప్రోత్సాహం అందిస్తే బాగుంటుంది..

ఆదిలాబాద్‌ జిల్లాలో సుమారుగా వెయ్యి నుంచి పదకొండు వందల కుటుంబాలు కులవృత్తిపై ఆధారపడి కుండలు, రంజన్లు తయారు చేస్తూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తయారు చేస్తున్న రంజన్లు, కుండలను రిటైల్‌ వ్యాపారంతో పాటు హోల్‌సేల్‌ ధరలకు విక్రయించేవారు. వీటిని స్థానికులతో పాటు మహారాష్ట్రలోని నాగపూర్‌, హైదరాబాద్‌ వంటి పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎంతో ఇష్టంగా మట్టికుండలను కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం కొంత గిరాకీ తగ్గింది.

కార్పొరేషన్‌ ఏర్పాటు చేయాలి



కులవృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న కుమ్మరులు ప్రస్తుతం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కుమ్మరి కులస్తుల కార్పొరేషన్‌ ఏర్పాటు చేసి ఆదుకుంటే బాగుంటుంది. కుమ్మరులు తయారు చేసిన రంజన్లను, కుండలను ప్రభుత్వమే కొనుగోలు చేసి ప్రభుత్వ కార్యాలయాలకు, వసతి గృహాలకు సరఫరా చేయాలి.

– నూటెంకి సత్యనారాయణ, కుమ్మరి సంఘం రాష్ట్ర నాయకులు

కుమ్మరి కుంటలను ఏర్పాటు చేయాలి



గత కొన్నేళ్ల కిందట వేసవి కాలం వచ్చిందంటే చాలు కుటుంబ సభ్యులందరం రంజన్లు, కుండలు తయారీలో బిజీగా ఉండేవాళ్లం. ఆడ వాళ్లు రంజన్లు, కుండలను తయారు చేస్తే మగవాళ్లు మట్టిని కొట్టిస్తాం. వీటి తయారీ కోసం మట్టి అవసరముంటుంది. ప్రస్తుతం మట్టి కూడా అభించడం లేదు. ప్రభుత్వం చెరువుల సమీపంలో కుమ్మరి కుంటలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– రాదరపు శేఖర్‌, కుమ్మరి కులస్తుడు

ప్రభుత్వ ఆసరా ఉండాలి



మేము మా కుల వృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నాం. నేను గత 65 ఏళ్ల నుంచి రంజన్లు, కుండలను తయారు చేస్తున్న. ఖర్చులు పెరగడంతో రెండేళ్ల నుంచి తయారు చేయడం లేదు. సర్కారు మా లాంటి కుల వృత్తుల వారికి సబ్సిడీపై రుణాలు ఇచ్చి ఆసరాగా ఉంటే కొంత అభివృద్ధి సాధిస్తాం. దీంతో కొంత భారం తగ్గుతుంది.

– రామెల్లి గంగమ్మ

శ్రమ వృథా అవుతుంది



ఒక రంజన్‌ తయారు చేయడానికి వారం, పది రోజులు పడుతుంది. ఎండకాలంలో అగ్గి దగ్గర ఉండి కుండలను కాలుస్తాం. కొన్ని సందర్భాల్లో వాతావరణం అనుకూలించకపోతే కుండలు కూలిపోతాయి. దీంతో చేసిన శ్రమ వృథా అవుతుంది. మా అంతా కష్టమైన బతుకు ఎవరిది ఉండదు. ఒక్కొక్కసారి కైకిలు కూడా పడడం లేదు.

– పోతుగంటి ప్రమీల

కొడుకులు చేయడం లేదు...



యాభై, అరవై ఏళ్లు కుండలు, రంజన్లు తయారు చేశా. గత కొన్నేళ్లగా గిరాకీ లేదు. తయారు చేయడం ఆపేశా. ఆధారం కరువై జీవనం కొనసాగించడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వాల నుంచి ఎలాంటి సపోర్ట్‌ దొరకకపోతే రానున్న రోజుల్లో కుమ్మరులు కుండలు, రంజన్లు తయారు చేయడం మొత్తానికి మానేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

– ఎగిడి రామక్క

రెండు కాళ్లు వీపుపైన....

- అంతర్గాంలో లేగదూడ జననం



ఆవుతో లేగదూడ

తాంసి: భీంపూర్‌ మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన రైతు ప్రమోద్‌కు చెందిన ఆవుకు విచిత్రమైన లేగదూడ మంగళవారం ఉదయం జన్మనిచ్చింది. లేగదూడ ముందు రెండు కాళ్లు సహజంగానే ఉండగా వెనుక వైపు ఉన్న కాళ్లు మాత్రం వీపు పైన ఉన్నాయి. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు చూసేందుకు కదిలివచ్చారు. అయితే జన్యుపరమైన లోపం కారణంగా ఇలా జన్మిస్తాయని మండల పశువైద్యాధికారి సుభాష్‌ రాథోడ్‌ వివరించాడు.

కణితి తొలగింపు

బోథ్‌: మండల కేంద్రంలోని ప్రసాద్‌ ఆస్పత్రిలో ఉట్నూర్‌ మండలానికి చెందిన ఓ మహిళ కడుపులో కణితి ఉండడంతో గత కొన్ని నెలలుగా బాధపడుతోంది. కాగా బోథ్‌లోని ప్రసాద్‌ ఆస్పత్రిలో సంప్రదించగా.. వైద్యులు రవీంద్రప్రసాద్‌, శివ ప్రసాద్‌, సంతోష్‌ వైద్య బృందం మహిళ కడుపులోని కణితిని మంగళవారం ఆపరేషన్‌ చేసి విజయవంతంగా తొలగించారు. కణితి దాదాపు మూడు కిలోలు ఉందని వైద్యులు తెలిపారు. ఆలస్యం చేసి ఉంటే పరిస్థితి విషమంగా ఉండేదని వైద్యులు పేర్కొన్నారు. కాగా వైద్యులను కుటుంబ సభ్యులు అభినందించారు.

వాగులో పడి ఒకరి మృతి

నేరడిగొండ: మండలంలోని వాగ్దారి గ్రామ సమీపంలోని కడెం నది వాగులో ప్రమాదవశాత్తు పటేల్‌ భరత్‌ (51) పడి మృతిచెందిన ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌ వివరాల ప్రకారం.. పటేల్‌ భరత్‌ నార్నూర్‌ మండలం గంగాపూర్‌ గ్రామానికి చెందినవాడు. రెండు నెలల క్రితం కూలీ పనిచేసుకునేందుకు వాగ్దారి గ్రామానికి రాగా సోమవారం హోలీ వేడుకల్లో పాల్గొన్నాడు. సాయంత్రం వాగులో స్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. సోమవారం రాత్రి ఎంత గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం మృతదేహం వాగులో తేలాడింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్‌ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బీఆర్‌ఎస్‌ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు



మహారాజ్‌ వద్ద ఆశీర్వాదం తీసుకుంటున్న సక్కు

నార్నూర్‌: లోకసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త గ్రామస్థాయిలో సైనికులుగా పనిచేయాలని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి హెచ్‌ గ్రామంలోని జాతీయ బంజారా దీక్ష భూమిని సందర్శించారు. దీక్ష గురువు శ్రీసద్గురు ప్రేమ్‌ సింగ్‌ మహారాజ్‌ ఆశీర్వాదం తీసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా మాన్కాపూర్‌ గ్రామానికి చేరుకుని పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. గతంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్‌ పార్టీ ప్రభుత్వ హయాంలో ఎక్కడి అభివృద్ధి అక్కడే నిలిచిపోయిందని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మెస్రం హన్మంతరావు, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్‌ ఖాసిమ్‌, మాజీ మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ తొడసం నాగోరావ్‌, మాజీ ఉప సర్పంచ్‌ విష్ణు ఫడ్‌, నాయకులు ఊర్వేత రూప్‌ దేవ్‌, కనక ప్రభాకర్‌, మాణికరావు ఉన్నారు.

పాముకాటుతో రైతు మృతి

- నాటువైద్యంతో విషమించిన ఆరోగ్యం
- ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



భుజంగరావ్‌ మృతదేహం



రోదిస్తున్న చిన్నారులు

దస్తురాబాద్‌: నాటువైద్యం వికటించి పాము కాటుకు గురైన రైతు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై యాసిర్‌ ఆరాఫత్‌ వివరాల ప్రకారం.. గోడిసీర్యాల గొండుగూడా గ్రామానికి చెందిన మెస్రం భుజంగరావ్‌ (23) ఈ నెల 18న గ్రామానికి చెందిన గోసుకుల మహేష్‌ పొలంలోకి పురుగుల మందు చల్లేందుకు వెళ్లగా పొలంలో పాముకాటు వేసింది. వెంటనే పొలం యజమాని ఇంటికి తీసుకెళ్లి అతడి భార్య మమతకు విషయం చెప్పి కారులో మండలంలోని ఆకోండపేట గ్రామంలోని ఓ నాటు వైద్యుడికి వద్దకు తీసుకెళ్లాడు. అతడు రూ.15000 ఖర్చు అవుతుందని తెలుపగా రూ.10వేలకు అంగీకరించి వారం రోజుల పాటు ఇంటికి వచ్చి వైద్యం చేశాడు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 25న జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు నాటువైద్యం అందించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

రెండ్రోజుల్లో గల్ఫ్‌ వెళ్లాల్సి ఉండగా..

- హోలీ వేడుకల్లో సరదాగా గడిపిన యువకుడు
- గోదావరిలో స్నానానికి వెళ్లి మృతి



లోలం అఖిల్‌ మృతదేహం

దిలావర్‌పూర్‌: తమకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో సాగు గిట్టుబాటు కాక ఉపాధి నిమిత్తం గల్ఫ్‌ వెళ్లేందుకు సన్నద్ధమవుతున్న యువకుడి కల ఆదిలోనే అంతమైంది. తమ కష్టాలు తీర్చేందుకు దూర దేశం వెళ్తాడనుకున్న కుమారుడు ఇక తిరిగిరాని లోకాలకు వెళ్లాడని ఆ తల్లిదండ్రుల రోదన అక్కడి వారిని కలిచివేసింది. ఎస్సై సుమాంజలి వివరాల ప్రకారం.. మండలంలోని సాంగ్వి గ్రామానికి చెందిన లోలం ముత్యం, లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు అఖిల్‌ (26) మంగళవారం గ్రామంలో హోలీ వేడుకల్లో పాల్గొన్నాడు. అనంతరం స్నానానికి గోదావరి నది తీరంలోని లిఫ్ట్‌ ఇరిగేషన్‌ కెనాల్‌ వద్దకు వెళ్లి ఈత రాక నీట మునిగి మృతిచెందాడు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అయితే అఖిల్‌ మరో రెండు రోజుల్లో ఉపాధి నిమిత్తం గల్ఫ్‌ వెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాడు. ఇంతలోనే ఇలా జరగడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్‌రూరల్‌: మండలంలోని చాందా (టి) జాతీయ రహదారి 44పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ముజాహిద్‌ కథనం ప్రకారం.. మండలంలోని బేల్లూరి గ్రామానికి చెందిన గజ్జి అశోక్‌, బొల్లి బాపురావ్‌లు ఘోట్కూరి గ్రామం నుంచి బేల్లూరి గ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. చాందా (టి) బైపాస్‌ సమీపంలో మహారాష్ట్ర డిపోకు చెందిన బస్సు ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.

'బంజారా గర్జన'కు సన్నద్ధం!

- ఎంపీ స్థానానికి పార్టీలు పరిగనలోకి తీసుకోకపోవడంతో నిరుత్సాహం
- భవిష్యత్తు కార్యాచరణపై సమాలోచనలు
- అన్ని పార్టీల్లోని లంబాడా నేతలు ఏకతాటిపైకి రావాలనే పిలుపు
- స్వతంత్ర అభ్యర్థిగా ఒకరిని బరిలోకి దించే యోచన..?



సోషల్‌ మీడియాలో చక్కర్లు కొడుతున్న ప్రకటన

సాక్షి,ఆదిలాబాద్‌: బంజారా నేతలు కదం తొక్కే యోచన చేస్తున్నారు. ఎస్టీ రిజర్వ్‌డ్‌ అయినటువంటి ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ స్థానంలో పార్టీలు తమను పరిగణలోకి తీసుకోవడం లేదన్న నిరుత్సాహం వారిలో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్తు కార్యాచరణపై సమాలోచనలు చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని పార్టీల్లో ఉన్న లంబాడా నేతలు ఏకతాటిపైకి రావాలనే పిలుపు ఆ సమాజం నుంచి వ్యక్తమవుతోంది. స్వతంత్ర్య అభ్యర్థిగా ఇందులో నుంచి ఎవరినైనా బరిలోకి దించే ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం.

నిరుత్సాహం..

ఆదిలాబాద్‌ ఎస్టీ రిజర్వ్‌డ్‌ పార్లమెంట్‌ నియోజకవర్గం నుంచి ఈసారి ఎన్నికల్లో ఆయా పార్టీల నుంచి పలువురు బంజారా నేతలు పోటీకి ఆసక్తి కనబర్చారు. అయితే ఇప్పటికే బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఆదివాసీ సమాజానికి చెందిన గోండు అభ్యర్థులకు టికెట్‌ ఖరారు చేశారు. ఇక కాంగ్రెస్‌ కూడా ఆదివాసీకే ఇవ్వాలనే నిర్ణయం తీసుకుందని ప్రచారం జరుగుతుంది. ఈ నిర్ణయాలపై బంజారా సమాజం నిరుత్సాహం వ్యక్తం చేస్తుంది. రెండు రోజులుగా ఈ సమాజం నుంచి సోషల్‌ మీడియాలో ఓ ప్రకటన చక్కర్లు కొడుతోంది. 'జై బంజారా.. జాగో బంజారా.. బంజారా నాయకులు అందరూ సిద్ధమవ్వండి' అని దాంట్లో ఉంది. బంజారా బలం .. గళం.. వినిపించాలని పిలుపునిచ్చారు.

ఇదీ పరిస్థితి..

ఎస్టీ రిజర్వ్‌డ్‌ పార్లమెంట్‌ నియోజకవర్గమైనటువంటి ఆదిలాబాద్‌ నుంచి లంబాడా సామాజిక వర్గానికి చెందిన నేతకు టికెట్‌ ఇవ్వాలని బంజారా సమాజం కోరుతోంది. ప్రధానంగా ఈ సెగ్మెంట్‌ పరిధిలో ఆదివాసీలతో పోల్చితే లంబాడా ఓట్లు తక్కువగా ఉన్నప్పటికీ, రాష్ట్ర, దేశ వ్యాప్తంగా తమ జనాభాను పరిగణలోకి తీసుకొని అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో ఇదే పార్లమెంట్‌ నియోజకవర్గం నుంచి బీజేపీ, బీఆర్‌ఎస్‌ల నుంచి గోండు సామాజిక వర్గానికి చెందిన సోయం బాపూరావు, గొడం నగేశ్‌ పోటీ చేశారు. కాంగ్రెస్‌ నుంచి రాథోడ్‌ రమేశ్‌ బరిలో నిలిచి ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల్లో బీజేపీ నుంచి బంజారా సమాజానికి చెందిన మాజీ ఎంపీ రాథోడ్‌ రమేశ్‌, మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌ బాపూరావు, జెడ్పీ చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌, భైంసా మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ జాదవ్‌ రాజేశ్‌బాబు, తదితరులు టికెట్‌ ఆశించారు. కాంగ్రెస్‌ నుంచి ఈ సమాజానికి చెందిన ఖానాపూర్‌ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌, ఏఐసీసీ సభ్యుడు నరేశ్‌జాదవ్‌ తదితరులు టికెట్‌ ఆశిస్తున్నారు. బీజేపీ టికెట్‌ ఖరారు కాగా, కాంగ్రెస్‌ టికెట్‌పై ఉత్కంఠ కొనసాగుతుంది. ఆ పార్టీ కూడా ఆదివాసీకే టికెట్‌ ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే బంజారాలు వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రాజకీయ భవిష్యత్తుపై వారిలో ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే అన్ని పార్టీల్లో ఉన్న బంజారా నేతలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిస్తున్నారు.

బరిలో నిలుస్తారా..

ఒకట్రెండు రోజుల్లో తమ కార్యాచరణ ప్రకటిస్తామని ప్రధాన పార్టీల్లోని బంజారా నేతలు 'సాక్షి' ఫోన్‌లో పలకరించినప్పుడు పేర్కొనడం గమనార్హం. ఈ దిశగా అందరూ కార్యాచరణ రూపొందిస్తున్నారు. అయితే దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి ఆయా నేతలు ఈ పిలుపునకు ఏవిధంగా స్పందిస్తారనేది వేచిచూడాల్సిందే. ప్రధానంగా అందరూ ఏకతాటిపైకి వస్తే స్వతంత్ర్య అభ్యర్థిగా తమలో నుంచి ఒకరిని బరిలోకి దించి ఈ పార్లమెంట్‌ నియోజకవర్గం నుంచి గెలుపొందాలని ఆలోచిస్తున్నారు. కాంగ్రెస్‌ అభ్యర్థి నిర్ణయమయ్యే వరకు వేచిచూస్తారా.. లేనిపక్షంలో ముందే ప్రణాళిక రూపొందిస్తారా అనేది చూడాల్సిందే.

ప్రభుత్వమే ఆదుకోవాలి

తలమడుగు: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్‌ చేశారు. మంగళవారం మండలంలోని బరంపూర్‌ గ్రామానికి చెందిన కాకర్ల ఆశన్న అనే రైతు వారం రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న వారు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రెండు మూడు సంవత్సరాల నుంచి అతివృష్టి, అనావృష్టి ఉండడంతో రైతు ఆశించిన పంట దిగుబడి రాక అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు నారాయణ రెడ్డి, అభిలాష్‌ రెడ్డి, ప్రతాప్‌, అశోక్‌, అఖిల్‌ తదితరులున్నారు.

నిందితుల రిమాండ్‌

తాంసి: భీంపూర్‌ మండలంలోని వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురిని భీంపూర్‌ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మండలంలోని బెల శ్రీరాంపూర్‌లో సోమవారం పోలీసులు తనిఖీలు చేపట్టగా రూ.10వేల విలువ గల దేశీదారు స్వాధీనం చేసుకున్నారు. దుర్వ జ్యోతిరాం, సంతోష్‌లను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. అలాగే నిపాని గ్రామానికి చెందిన హన్మంతు అనే వ్యక్తిని సెల్‌ఫోన్‌ చోరీ కేసులో అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపినట్లు భీంపూర్‌ ఎస్సై ప్రదీప్‌ కుమార్‌ తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



రికార్డులు పరిశీలిస్తున్న పీవో

ఉట్నూర్‌రూరల్‌: వైద్యాధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం ఐటీడీఏ క్యాంప్‌ కార్యాలయంలో ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ పీహెచ్‌సీలోని వైద్య పరీక్షల తీరును అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలలో సాధారణ కాన్పులు చేయాలని ఆదేశించారు. సమయపాలన పాటించాలని తెలిపారు. అనదపు జిల్లా వైద్యాధికారులు డాక్టర్లు బాలు, ఆదిలాబాద్‌, ఆసిఫాబాద్‌, చిర్యాల్‌ డిప్యూటీ డీఎంహెచ్‌వోలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్‌: గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌ రూరల్‌ మండలంలోని చించుఘాట్‌ బాలికల ఆశ్రమ పాఠశాల, మోడల్‌ స్కూల్‌, వాన్‌వాట్‌ ఆశ్రమ పాఠశాల, జెండాగూడ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించి రికార్డులను పరిశీలించారు.

కొనసాగుతున్న కడెం మరమ్మతులు



వరద గేట్లు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కడెం: రాష్ట్రం ప్రభుత్వం ఇటీవలే కడెం ప్రాజెక్ట్‌ వరద గేట్ల మరమ్మతుల కోసం రూ.5.46 కోట్లు మంజూరు చేసింది. దీంతో ప్రాజెక్ట్‌ మరమ్మతులు కొనసాగుతున్నాయి.రోలర్స్‌, రూప్స్‌, కొన్ని గేట్ల కౌంటర్‌ వెయిట్‌ల మార్పులు చేయనున్నారు. మొత్తం 18 వరద గేట్లలో 9 జర్మనీ టెక్నాలజీ గేట్లు ఉండడంతో వాటికి సంబంధించి బేరింగులు జర్మనీ నుంచి తెప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.